స్వర్ణసీత

'ఆనంద కుమార్'

మా వెనుక పడే నీడలు రెండూ దూరాన విడిపోతున్నాయి.

తెల్లని గుర్రాలలా ఉబుకుతుంటూ పరుగెత్తుకు వచ్చే నురుగుకెరటాలు మాముందు విచ్ఛేదమయిపోతున్నాయి.

సన్నని యిసుక నా చేతిలో పోస్తూ ఆమె చెప్పడం మొదలుపెట్టింది:

“అతని ‘మంగళం’ చదివేను...నన్ను ఎంత కదిలించిం దనుకున్నావ్! అది చదివాకే దాక్షిణాత్య దేవాలయా లన్నీ చూడా లనిపించింది. అప్పుడే బయలు దేరుత.

శ్రీరంగం వెళ్లేనన్నాను కాదూ!

దేవాలయమంతా కాళ్లు అరిగేవరకూ తిరిగేను.

ఎంత కళావైదగ్ధ్యము! భక్తిఉద్రేకాలను రాశిగా పోసి ఆ దేవాలయం కట్టేరు. దైవసాన్నిధ్యంలో మోకరిల్లినప్పుడు మీరు జ్ఞాపకంవచ్చారు... ‘సుకుమార్’ భార్య జ్ఞాపకంవచ్చింది...అతను మొట్టమొదట దైవసాన్నిధ్యంలో అక్కడే కాదూ ఆమెను చూస్తే. తన పేరున అర్చన చేయించబోయి తన జరీ కండువామీద పొరబాటున కుంకుమ వొలకబోసిన ఆమెపేర అర్చన చేయించివచ్చాడు కాదూ?

నాకు దేవుని చూసినకొద్దీ ఆ దంపతులు జ్ఞాపకంవచ్చారు......

నేను ఒక్కరితినూ వచ్చేనే అనిపించింది.

ఒకనాడు సంధ్యాకాలంలో దేవాలయానికి వెళ్ళేను. మీకు నచ్చిన ఆ లేతమబ్బురంగుచీర కట్టుకున్నాను. బాగా జ్ఞాపకం. ఆ ప్రెమిదలమధ్య నుంచున్నాను. నన్ను నేనే చూసుకోవా లనిపించింది. అక్కడ నేనుకూడా శిలావిగ్రహమై ఆచంద్రార్కమూ నిలిచిపోవా లనుకున్నాను.

రామేశ్వరం చూశాను.

చిన్నచిన్న దేవాలయాలన్నీ చూడా లనుకున్నాను.

కొబ్బరిచెట్లూ, పోకచెట్లూ వున్న దేశంలోకి వచ్చాను...శుచీంద్రదేవాలయం చూసితీరాలి. ఆది శంకరుడుకూడా ఈ దేవాలయం చూశాడు. ఎంతటి కళావైవిధ్యం! నువ్వు చూసితీరాలి.

శుచీంద్రంత్రిమూర్తుల దర్శనార్థం బయలుదేరేను.

స్థాణుమూర్తిదేవాలయానికి కలువలు తీసుకుపోయాను. ‘శివునికి కలువపూవు!’ లని అందరూ ఆశ్చర్యపోయారు......

జయఘంటలు మ్రోగుతున్నాయి!...

దోసిలినిండా కలువపువ్వులు—విరిసినవీ, విరియనివీ.

పతాకముద్ర పట్టిన స్త్రీవిగ్రహంపాదసన్నిధి నుంచి నా శిరస్సుతో ఆ పాదయుగ్మం స్పృశించాను,

త్రోవ చేసుకుని శివస్వరూపసందర్శనానికి వెళ్ళేను.

సుందరమూర్తినాయనార్ జ్ఞాపకంవచ్చాడు. ఆయన ఈప్రాంతాలన్నీ తిరిగాడు. మనస్సు దైవసాన్నిధ్యంలో వుంచాడు. కాని దైవమే అతని గీతావళితో ప్రయాణం చేసేవాడు......

ఒకసారి ప్రసిద్ధ - తిరువారూర్ దేవాలయానికి వచ్చాడు. అక్కడ శివునే వరించిన తపస్విని వుంది,

కేవలము పార్వతీదేవి అపరావతారము—పరవైయార్. ఆమె భక్తి చూసి సుందరమూర్తి తన్మయుడయ్యాడు. వారు దైవసాన్నిధ్యంలో భార్యాభర్త లనుకున్నారు; అయినారు.

పరమశైవశిఖామణినిగురించి యీ సంఘటన నాకు జ్ఞాపకముండిపోయింది. అప్పటినుంచీ సుందర మూర్తినాయనార్ 'తేవారమ్' లోని ధ్యానగీతాలను మననం చేశాను. ఎన్నోసార్లు ఎవరైనా పాడమన్నప్పుడల్లా సభల్లో పాడేను. వారికి కొంచెం నిస్పృహ కల్గించింది. జయదేవగీతాలను పాడమని అడిగేవారు; సుందర మూర్తినాయనార్ గీతాలను పాడేదానిని......

నేను ముందుకు వెళ్లి అంతరంగంలో అడుగు పెట్టేను. 'శివోహం' అంటూన్న కొంతు నాభిలో నుంచి హృదయం చీల్చుకుని గొంతులోంచి వస్తూంది. నడిచే చోటంతా మట్టిగా వుంది. కాని సాష్టాంగంగా స్థాణుమూర్తికి వందన మాచరించాను. స్మశానంలో కూడా శివతాండవానికి అవిధంగానే మోకరించివుండే దాన్ని.

గర్భాలయంలోనికి వెళ్ళేను. కళ్లు రెండూ గట్టిగా మూసుకుని అభిషేకజలానికి హస్తం చాచాను. ఇంకా ఘట్టిగా కళ్లు మూసుకున్నాను. ఇంకా స్పష్టంగా శివలింగము కనుపించడానికి. నాచేతిలో ఉదకం పడలేదు. కళ్లు తెరిచి స్థాణుమూర్తికేసి చూశాను.

ఎదురుగా నంబూద్రి; దేవాలయార్చకుడు.

"మీరా ! మీరేనా ?" అని అడిగేడు.

"నేనే; నేనేనండి. పాదోదకం యివ్వరూ ?" అని వినయంతో అడిగేను.

"సుందరమూర్తినాయనార్ గీతాల్ని పాడుతారు కాదూ ? తేవారంలోని గీతాలను దైవసాన్నిధ్యంలో పాడాలి. దేవునికి అభిషేకం స్తోత్రాలతో మీరే చెయ్యాలి." అన్నాడు. పీఠం చూపించాడు.

నాలుగువైపులా నాలుగు వెండిపువ్వులు. ఎత్తయిన నగిషీ కోళ్ల పీట. కూర్చోడానికే వణుకు వచ్చింది. గొంతు విప్పడానికి దడ వచ్చింది. శివసాయుజ్యం పొందిన నాయనారే నాముందు వచ్చి కూర్చున్నట్లయింది. ఎదురుగా నంబూద్రి వినమ్రుడయి నించున్నాడు. పార్వతీచరణనూపురాలనుగురించి మొదలు పెట్టేను. ఆదిశంకరుని ధ్యానముద్రనుగురించి ఆలపించాను. శివతాండవంమీద గీతం పాడేను. శివప్రళయ తాండవం మళ్లీ అంతమయ్యేటప్పటికి శాంతమూర్తిని గురించి గట్టిగా నా ఆవేశము అణిగేవరకూ పాడేను.

నేను శివమెత్తి వున్నానా? అందరూ పరవశులై వున్నారా? ఆపగానే నాకే క్రిందికి విసిరి పారవేసినట్లయింది......

ఎన్నోసార్లు, ఎన్నోమాట్లు పాత్రానుగుణమైన ఉద్రేకంతో పాడే ననుకున్నాను. జనంకూడా అన్నది. యువకులందరూ తన్మయతతో సమగ్రంగా విన్నారు. విని మళ్ళీమళ్ళీ వారి హృదయంలోనే పాడుకుని నన్ను అభినందించేవారు. ఎన్నడూ ఈ వెర్రిఆవేశంతో నేను ప్రార్థించలేదు. పావనసలిలం కోసం, పాదగంగకోసం స్తుతించాను.

నంబూద్రి ఉద్ధరిణితో ఉదకం తెచ్చి నా పుడిసిట పోశాడు. అది కళ్ల కద్దుకుని శిరస్సున చల్లుకున్నాను......

ఆలయం దాటి బయటకు వచ్చాను. కొంచెం కూడా నడవలేకపోయాను. ఎక్కడలేని నీరసతా వచ్చింది. వడిలిన కలువకాడలా ఒరిగిపోయాను. ఆ నీరసత యిప్పుడుకూడా తెల్చుకోలేను......"

* * *

నా రెండుచేతులూ తన చేతుల్లోకి తీసుకుంది.

నేను అంతా విన్నాను. ఎదురుగా కూర్చుని, పుప్పొడిరంగు చెక్కిళ్లు ఎర్రబడడం చూశాను. పెదిమెలు సడలిన గులాబీరేకుల్లా వణకడం చూశాను......

ఆమే, నేనూ కూడా ప్రయాణము చేశాము కాదూ? కలకత్తానుంచి కాశ్మీరు వెళ్ళేము. ఆమె ఉపన్యాసంకోసమని నేనూ వెళ్ళేను.

శంఖంలాంటి గొంతుకలోంచి వెలువడే మధుర పదాలకోసమని వెళ్ళేను; ప్రతివాక్యమూ వేదవాక్యం అన్న పవిత్రతతో వినాలని......

మరునాడు ఆ ఆనందోత్సవము.

రాత్రి పడుకోకుండా కూర్చోబెట్టింది.

నిద్దుర రావడం లేదంది.

"గులాబీల వాసన కలిగించే కలతలా వుంది మనస్సు. రేపు ఏమవుతుందో ! జీవితమంతా నిర్ణయింపగలిగే ప్రథమప్రయత్నం. దేశమంతా వినడానికి వచ్చారు. ఏం చెయ్యగలను ?"

ఓదార్చాలన్న స్పృహ నాకు లేదు. నేను ఆమెలోనే వున్నాను—పుష్పానికి సౌరభంలాగు. మాట చెప్పబోయాను. సాయంసంధ్యాసమయంలో కమలములో చెరపడ్డ తుమ్మెదలా గిలగిలా గొంతులో కొట్టుకుని నిల్చిపోయింది......

లోపలకు వచ్చి పడుకోమనడానికి లేచేను. రెండు చేతులతోనూ కూర్చోబెట్టింది......

* * *

అప్పటికి నెలరోజు లయింది.

అప్పుడూ యింతే.

రెండు చేతులతోనూ కూర్చోబెట్టింది.

నక్షత్రాలు ఒక్కొక్కటే చెబుతున్నాను. మా తాతగారు నన్ను ఒళ్ళో కూర్చోబెట్టుకుని ఎప్పుడో ఆకాశమంతా చూపించారు. ఆ జ్ఞాన ముంది. నేనూ ఈనాడు ఆమెకు నక్షత్రస్థానాలు చూపించగలిగేను. శుక్రుణ్ణి చూపించాను. ఎంతో తేజోవంతమయిన నక్షత్ర మన్నాను.

"కాదు. విగ్రహ" మంది. ఒప్పుకున్నాను.

ధ్రువనక్షత్రము చూపించాను. "నిశ్చలతకు ఆదర్శ" మన్నాను. ఒక్కొక్కటే చీకటిలో చూశాము.

ఆమెకనులలో నక్షత్రాలు మెరుస్తున్నాయి. అక్కడ చూడబోయాను.

వ్రేళ్లు చేతి కిచ్చింది. గోళ్లకు ఎర్రని గోరింటాకురంగు; ఆ రంగులో మిలమిలమనే తారకరశ్మి. అదే చూసి ఊరుకోలేకపోయాను. కొత్త పగడాలలా మెరసే ఆమె పెదిమెలమీదకు నా కళ్లు పోయితీరాయి. చటుక్కున నాకేసి చూసింది. ఎంతో చనువుతో నవ్వి-

"సప్తఋషులు ఎక్కడ వున్నారో ?" అంది.

చూపించాను. ఆ మొదటి నాలుగున్నూ, తక్కిన మూడున్నూ. అరుంధతి తనకు కనుపించలేదంది. మళ్ళీ వ్రేలు పట్టుకు చూపించాను. ఆ సన్నని వేళ్లను కలువమొగ్గలా ముడిచింది......

కాలం ఆ క్షణంలో నిలిచిపోయింది.

పృథివికి భ్రమణం ఆగిపోయింది. చీకటి ప్రవహించడం కట్టిపోయింది. మే మిద్దరమూ లేనే లేము. ఎవరమూ లేము......

* * *

నేను శాంతినికేతనం వదలి వచ్చేశాను. నిత్యజీవితంలో ఒక మెట్టు ఎక్కాలని ప్రయత్నం. ఉత్తరాలు ప్రతిదినం వ్రాసేవాడిని :

"హవామహల్‌కి ఎదురుగా కూర్చుని నువ్వు చెప్పిన శుచీంద్రయాత్ర ఏనాటికీ మరిచిపోను. అది మరచిపోయిన్నాడు నేను లే నన్నమాట. ఆనాటివరకూ......
నీ—ఆనందుడు"

అని, మళ్ళీమళ్ళీ—

"ఏ అమృతమైన కావ్యం చదివినా నీతోనే చదవా లనిపిస్తుంది......

ఏ తీయని శృతి విన్నా నీదృష్టితోనే విన్నాను. అందుకే...
నీ—ఆనందుడు".

మళ్ళీ వ్రాశాను :

"నిశ్శబ్దతే పలుకరించి మాట్లాడుతూ వుంది. నీ దగ్గరనుంచి ఉత్తరాలు అరుదైపోతూవున్నాయి. నీకు మరుపు వస్తానన్న భయం ఏనాడూ నాకు లేదు. కాని నీదగ్గరకు త్వరగా వచ్చి చేరలేనేమోనని భయపడుతూ వున్న—
నీ ఆనందుడు"

అప్పుడే 'యశోధర' నాటకం పూర్తిచేశాను. నా సర్వస్వమూ సిద్ధార్థుని ప్రతిమలో అమర్చబోయాను. కాని నాకు తెలియకుండానే యశోధరకు ఇచ్చాను. యశోధరను చూశాను. ఆమే ! అంతా ఆమే ! ఎంత పోలిక !

తక్షణం నీలపు కాగితం తీశాను:

"ఇదుగో, నీకు కానుక. ఎంతో ఏకాగ్రతతో వ్రాశాను. ఐదు అంకాలు: సిద్ధార్థుని జన్మమూ, వివాహమూ, త్యాగమూ, తపస్సూ, పునస్సంధానమూ వ్రాశాను. ఎన్నాళ్ళో నాలో వుండే సంగీతమంతా ఇందులో ఇమిడ్చేను. తీరా చదివిచూశాను. అది సిద్ధార్థుని చరిత్ర. యశోధరగాథ. అంతా నీ పోలికయిన యశోధర. నువ్వే. ఆ యశోధరకు నారచన కానుక. స్వీకరించవూ? నీకే అంకితం చెయ్యాలనుకుంటున్నా. అనుమతించవూ ? మొట్టమొదట నీకే వినిపించి తరువాత ప్రచురించా లనుకుంటున్నా. నీ మూగనోము మాని జవాబు వ్రాయవూ ? తత్క్షణం వ్రాస్తావు. నాకు తెలుసు. జవాబుకు ఎదురుచూస్తూవున్న-నీఆనందుడు.."

ఎదురుటపా చూశాను. నాకే నవ్వు వచ్చింది. ఇంకా ఉత్తరము చేరనైనా చేరదుకదా అని. రెండవ టపా చూశాను. రేపు ఇలాగే నడుస్తూ వస్తాడుకదా అనుకున్నా.

మూడవనాడు ఉత్తరం వచ్చితీరుతుంది...

ప్రొద్దుటే స్నానం చేసి సముద్రపు ఒడ్డున నడిచాను. ఎంత చక్కని సూర్యకిరణాలు! కొంచెం సేపయితే సహనకరం కావు. ఆ అలలు చంటిపాపల్లా ఆ కిరణాలతో ఆడుకుంటున్నాయి. సాయంత్రానికి నావెత్తున లేచిపోతాయి. అంత ఉద్రేకంతో ఎంత ఎత్తు ఎగిరితేమాత్రం చంద్రుని తాకగలవా ? కొంతమంది హృదయంలో ఆ తితీక్ష వుంటుంది. అలలు ఎంత ఎత్తు లేస్తే అంత లోతు కాదూ ? ..

ఉత్తరం వస్తుంది .. నేను వెళ్ళి యీ 'పంచవటి'ని ఆమెకు చదివి వినిపిస్తాను. ఎంత బాగుందో చెప్పడానికి ఆమెకు మాటలు రావు. వళ్ళీ రెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకుంటుంది.

"నిజంగా నన్ను అంత ఆదరంతో చూస్తారా?" అని ఆమె అడుగుతుంది.

అప్పుడు చెప్పడానికి నాకు మాటలు రావు.

దేశమంతా తబ్బిబ్బు అయ్యే ఆమె నాయశోధరలో వుంది. ఇమిడిపోయింది. యశోధర నాసృష్టి. ఆమె నాదే.

ఉత్తరం వస్తుందని ఎదురుచూస్తున్నా. ఈ పాటికి వస్తూవుండాలి. ఎన్ని ఆలోచనలు!

అందరూ దినదినమూ స్తుతించే ఆమెకు నా చిన్న రచన ఎంత అల్పం అనుకున్నాను...'చంద్రునికి ఒక నూలుపోగు' అని సమర్థించుకున్నాను.

"మీరు వ్రాసినది నాకు చదివి వినిపించండి. తరువాత ఆలోచిస్తా"నని వెకిలిగా వ్రాస్తుంది.

నేను చదవడానికి వెళ్లి ఆమెను చూస్తూ చదవడానికి తీరిక లేక వచ్చేస్తాను. మళ్లీ ఉత్తరం వ్రాస్తాను......

పోస్టు జవాను నడచిపోతున్నాడు!

ఉన్నపళంగా లేచిపోయాను!!

"మాణిక్యం! ఉత్తరాలు ?" అని అరిచాను.

"ఏమీ లేవండి !" అన్నాడు.

వణికిపోయాను...మళ్ళీ చూడమన్నాను.

"లేవండీ" అన్నాడు.

పొరబాటు అయివుంటుంది. నిన్న వ్రాయడానికి సావకాశం లేకపోయివుండవచ్చు. రేపు తప్పకుండా వస్తుంది.

ఈవేళ యశోధరస్వరూపం మళ్ళీ దిద్దుతాను.

సిద్ధార్థుణ్ణి దగ్గరగా కూర్చోమంటుంది. అతనిని పెనవేసుకుపోతుంది. సిద్ధార్థుడికి ఈ ఆనందం అశాశ్వత మనిపిస్తుంది. ఆకౌగిటిలో నీరయిపోతుంటాడు.

"ప్రేమస్వరూపము ఏమిటో ?" అంటాడు. "చిరుగాలికూడా వినకూడదు. ముఖం దగ్గరగా తీసుకువస్తే చెబుతాను" అంటుంది.

దగ్గరగా వస్తాడు. రెండు చేతులతోను ముఖం పట్టుకుని పెదిమెల్ని లేతగా ముద్దు పెట్టుకుని "ప్రేమస్వరూపం" అంటుంది...

ఈ ఘట్టం ఒకవేళ ఆమెకు నచ్చదేమో!

... ...

ఈవేళ ఉత్తరం వస్తుంది. ఈవేళ సముద్రం దగ్గరకు వెళ్లను. నిన్న వెళ్తే ఉత్తరం రాలేదు. ఈవేళ వెళ్లకపోతే వస్తుంది.

కూర్చుని యశోధరాసిద్ధార్థుల ప్రథమసందర్శనం చదువుతా.

సిద్ధార్థుడు ఆరోజు అందరికీ కానుక లిస్తూంటాడు. తను యివ్వడానికి కొంచెం జంకి చెన్నునిచేత యిప్పిస్తుంటాడు.

కోసలరాజపుత్రిక వస్తుంది. గుఱ్ఱపుస్వారిలో పురుషులనుకూడా ఓడించిన నిపుణురాలు. చెన్నుడు మణులనూ, తాళపత్రరామాయణమూ యిస్తూంటాడు. ఆమెకు నచ్చలేదు.

సిద్ధార్థునివైపు తిరిగి "ఇక్కడ రాజపుత్రుడెవరో తెలుసుకోవా లని వుంది" అంటుంది.

ఈ ప్రశ్నకు చెన్నుడు తెల్లపోతాడు.

యోధానయోధుడు సిద్ధార్థుడు ఆ స్త్రీస్వరూపం చూసి చిట్లిన కలువరేకులా ఒణికిపోతాడు.

తరువాత సిగ్గుతో క్రుంగిపోతాడు.

"క్షంతవ్యులము. ఈ మా ఆతిథ్యాన్ని స్వీకరించి పునీతులను చెయ్యవలసినదిగా మాకోరిక" అని వినయంతో, ఠీవితో అంటాడు. స్వహస్తంతో ఇస్తాడు... అందరికీ ఇస్తాడు...

పారితోషికసామగ్రి అంతా విరివిగా యిచ్చేస్తాడు.

యశోధర ఒక చివురున మిగిలిపోతుంది. క్రింది నీటిలో ప్రతిబింబించి చిరుగాలికే కదిలే సుమస్వరూపము ఆమెది. మూర్తీభవించిన తీయని కల. కదలడానికి బరువయ్యే హృదయము. కోసలరాజపుత్రిక చేసిన అమర్యాదపు చేష్టకు ఆమెవదనం ఎఱ్ఱబడిపోయింది. ఆ రక్తిమ ఇంకా తగ్గలేదు.

సిద్ధార్థుడు ఆమెను చూసి స్థాణువై పోయాడు. ఆ విగ్రహం ఉషఃకన్య అనుకున్నాడు.

వడ్డాణం ధరించి వచ్చిన ఏకైకచంద్రకిరణమనుకున్నాడు.

ఆమెరాకను సమన్వయించుకోలేకపోయాడు.

ఎవరో ? ఏ మివ్వగలడు ?

చెన్నుడు వివరించి చెప్పేడు.

రాజపుత్రిక యశోధరసన్నిధికి పోయి తనే తీసుకువచ్చాడు. ముందు చెన్నుడు, వెనుక యశోధర. భగీరథుడు గంగను భూతలంలోకి తీసుకువస్తున్నాడు...

బహూకరించడానికి ఏమీ తగినది లేదు.

చెన్నునితో ఆమెకు నచ్చినదీ, ప్రియమైనదీ తెలుసుకొని తెప్పించమంటాడు.

యశోధర పెదిమెలు విప్పుతుంది.

కిన్నరవాణినుంచి వచ్చే సంగీతం !

"క్షమించాలి. నాకు ప్రియతమమైనది యిప్పించాలి."

"పృథివిలో ఎక్కడ దొరకినా ఈ పాదాల సన్నిధిని వుంచడానికి శాక్యుని వాక్యం బాస" అంటాడు ఆనందంతో...యశోధరకళ్లు మెరిసిపోతాయి.

"కోరుకుంటున్నాను. మీరు. మీరే నాకు కావాలి" అంటుంది.

సిద్ధార్థుడు ఆ మకరానికి ఆనుకుంటాడు. సింహలలాటంమీద కాలు గట్టిగా మోపుకుంటాడు.

'శాక్యుని వాక్యం బాస' అంటుంది యశోధర.

సిద్ధార్థుడు పీఠం దిగి వస్తాడు......

ఎంత చక్కని ఘట్టం !

* * *

ఆమెకు తప్పకుండా నచ్చుతుంది. నచ్చితీరుతుంది. సంతోషంతో నాకేసి చూస్తుంది. ఆ ఒక్క చూపూ చాలదూ జన్మమంతా ఆవరించుకోడానికి ?

కాని మరునాడు ఉత్తరం రాలేదు. తరువాతా రాలేదు.

భూమిలోనికి...అధఃపాతాళంలోనికి క్రుంగిపోయాను. ఎంతో ఆశ పెట్టుకుని వున్నాను. నా ఉత్తరానికి జవాబు వ్రాయకపోతే నా స్థితి ఆమె తప్పకుండా ఊహించుకోగలదు.

నేను చెప్పనవసరం లేదు. అయినా వ్రాశాను :

"రోజురోజూ ఒక క్రొత్త ఆవేదన తెస్తూంది. ప్రతిదినమూ నిరీక్ష. ప్రతిదినమూ కాంక్ష ఎక్కువవు

తుంది. ఆ వేదనలో క్రొత్తదనమూ, కాంక్షలో పాతదనమూ రావడానికి నువ్వే సరియైన సమాధానం చెప్పాలి......

"దూరపుతనంలో బాధ భరించలేనప్పుడు దగ్గర వున్నప్పుడు ఆనందం భరించలేనని నన్ను తృణీకరించవద్దు. ఆ అర్హతా సంపాదించుకో ప్రయత్నిస్తాను...

"తప్పకుండా జవాబు వ్రాయవూ ?..."

ఆరునెలలవరకూ జవాబు లేదు.

మళ్ళీ మళ్ళీ వ్రాశాను. ఆమెకు విసుపు కల్గిస్తున్నానేమో...

"నాకు ప్రభాతం నీ నామోచ్చారణతో ప్రారంభం. నిద్దుర నీ పేరుతో.

"నీదగ్గరనుంచి ఒక్క చల్లని వాక్యం రాకపోతే జీవితమంతా కటికనిశీథిని."

జవాబు రాలేదు. తరువాతా రాలేదు... ఎప్పుడూ రాలేదు.

* * *

అంతటితో నా జీవితం నిల్చిపోయింది.

ఆనాటితో నా ప్రవృత్తే నిలిచిపోయింది.

శైలాన్ని ఢీకొన్న నిర్ఝరిలా వెయ్యివిధాల ప్రవహించడం ప్రారంభించింది. శకలా లయిపోయింది., స్వరూపరహిత మయిపోయింది.

... ...

నా ఆశే తప్పేమో!

లేక ఈ నిరాకరణకు కారణ ముందేమో.

ఏమీ లేదు. అందుకు కొంచెమూ సావకాశము లేదు...

ఆమె ప్రపంచకానికంతకూ ఆనందప్రదాయిని. ఎంతమందికి తన వక్తృత్వచాతుర్యమూ, గానమాధుర్యమూ చూపించలేదు ? ఎంతమంది మన్ననలకు ఆమె పాత్రురాలు కాలేదు ? ఆమె బహూకరించిన చేవ్రాలు చూసి ఎంతమంది మురిసిపోవడంలేదు ?

నేనొక్కడినే దూరమయిపోయాను! పూర్వజన్మంలో ఏ క్రౌంచమిథునాన్ని ఎడబాటుచేశానో!!

* * *

ఏం చెయ్యగలను! ఎక్కడికి వెళ్ళగలను!!

విశ్వం వచ్చి పిలిచేడు, ఇంద్రాణి నృత్యం చేస్తుందని.

అమ్మ రమ్మని చెప్పమన్న దని ఎంతో అనురాగంతో వచ్చి చెప్పేడు— చెల్లెలు నృత్యం చేస్తుందని.

ఎంత చల్లని హృదయాలు! ఈ చిన్న హృదయాలలో ఎంత నిర్మలత్వం! నిశ్చింతతో విరగబడి నవ్వగలరు. నవ్వి, నవ్వినందుకు సంతోషపడగలరు.

సాయంత్రం వెళ్ళేను.

ఆ నల్లని తెరముందు పచ్చని నున్నని శరీరం. చంద్రవంకలా వంగి నమస్కారం చేసింది. అందరికీ, సభకంతకూ నమస్కరించింది.

నాకే నమస్కరించిందని నేను అందుకున్నాను.

పెదవి విప్పి దీవించాను. అందరూ చూశారని సిగ్గుపడ్డాను. నన్ను చూసి నేనే.

ఆమెవెనుకనుంచి కిన్నెరకోటినుంచి వచ్చేలాంటి వీణానాదం అందుకొన్నారు.

తాం, తాం, తధికిన, తాం, తాం.

అడుగు తీసి అడుగు వేస్తూంది. పాదాల గజ్జెల రెండింటి చప్పుడూ సుధామస్థానంనుంచి వినిపించే ధ్వనిలా వుంది. కిసలయాల్లాంటి ఆ వేళ్ళు ముద్రలుపడుతున్నాయి.

తధికిన, తధికిన, తోం, తధికిన.

త్వరగా పాదాల గోళ్ళ ఎర్రని మెరుపుకూడా కనుపించని వేగంతో ఆ చిన్నిపాదాలు ఆలీఢంలోంచి ప్రత్యాలీఢంలోకి మారిపోతున్నాయి.

తాం, తాం, తధి, తధి.

తధికినతో, తకతై,

తక, తక, తకతాం.

వెనుక కంఠస్వరం హెచ్చిపోతూంది. ఆవేశముతో గొంతుక వణికిపోతూంది. ఇంద్రాణితన్మయత హెచ్చిపోతూంది. భంగిమలలోని ఒంపుల్లోంచి నా మనస్సు తిరిగేలోపున మరొక భంగిమ వచ్చేస్తూంది...

సర్పశీర్షం పట్టిన ఆ హస్తాలు శివజటాజూటానికి చుట్టుకునే సర్పాల్లా వంపులుతిరిగిపోతున్నాయి. ధృతి భావంలో శరీరంమీద జ్ఞానమే లేదు. సర్వస్వమూ ఏకాగ్రమైన ధ్యాస. నాగుండెలు ఆవేశంతో కొట్టుకుంటున్నాయి. విద్యుల్లతలా మెరసిపోతూంది ఇంద్రాణి; హిమాలయశైలశిఖరంలా ఎక్కడో దూరంగా కనుపిస్తూంది. క్రింద పడిపోతుందేమోనని లేచి నిల్చున్నాను.

తాం, తాం, తధకిన తా—ఆం...

ఇంద్రాణి ఆగింది. పరిగెత్తుకు వచ్చి ఆగిన లేడిపిల్లలా వుంది.

ఒళ్లంతా ముచ్చెమటలూ పోశాయి. పాపం! ఘర్మబిందువు ఒకటి చెక్కిలిమీదనుంచి జారుతూంది. ఆ వెల్తురులో మిలమిలా మెరుస్తూంది. ముక్కునున్న అడ్డబాసచిగురున మెరిసే ముత్యానికీ, చెక్కిలిమీద బిందువుకీ ఏమీ తేడా తెలియడంలేదు...

ఆమెఆవేశం అణగింది. ధ్యానముద్ర పట్టగలిగిన నిశ్చలత వచ్చింది. సముద్రం ఒక క్షణం నిలిచిపోయినట్లుంది.

"భద్రాయ నిద్రాయతే" అని కాదూ కల్పాంతమందు విష్ణుస్వరూపం ?

మళ్ళీ ప్రారంభించింది. ఎంతో స్నిగ్ధదృక్కులు.

"చింతయామి సతతం"

చటుక్కున లేచిపోయాను. 'చింతయామి'! తెలియకుండానే నన్ను ఏ భావంలోకి పంపేసింది ఈ ఇంద్రాణి!

లేచి వచ్చేశాను.

ఆనందముహూర్తాలే బాధ కలిగిస్తాయి. ఉషఃకాంత కెంగతో సాగిపోయే సాంధ్యదేవత అనిపిస్తుంది. స్మృతిపథాలపై అలుముకున్న ఈ నునుమంచుతెరను పూర్తిగా ఈ ముహూర్తం విచ్ఛేదంచేసింది. మరచిపోయి నడవదల్చుకున్న మార్గంలో కప్పపీలులేని అగాధం ఉందని చూపించింది ఇంద్రాణి......

నన్ను మరచిపోయి అందరి ఆవేదనలతోనూ సానుభూతి చూపించా లనుకున్నాను. కేవలమూ సుమరూపం ధరించా లనుకున్నాను...

కాని ఏమూలో దాగి అణగద్రొక్కబడిన తితీర్ష బయటికి వచ్చి పొగమంచులా జీవితమంతా ఆవరించింది...

బయట వెన్నెల కురుస్తూంది. ఆ చెట్ల ఆకులు గాలికి అల్లల్లాడి పోతున్నాయి. క్రింద నీడలు చిత్రచిత్రంగా అల్లుకుపోతున్నాయి.

అక్కడ నుంచోలేకపోయాను. ఆ సుధామాస్థానంలోనుంచి వచ్చే గజ్జెల చప్పుడికి దూరంగా నడచిపోయాను!!

* * *

ఎప్పటికీ జవాబు రాలేదు.

* * *

ఆరాత్రి తెల్లని దుప్పటిమీద గోరింటాకు చుక్కలు!

సాయంత్రం ఇంద్రాణి పెట్టుకుంటూన్నప్పుడు నా రెండు చిటికెనవ్రేళ్లకూ పెట్టించుకున్నాను.

మగవాళ్లకు గోరింటాకని కిలకిలా పుచ్చపువ్వులా నవ్వింది ఇంద్రాణి. నాకు స్మృతిచిహ్నమని ఆమె కేమి తెలుసు? ఆ గోరింటాకువ్రేళ్లలో తారకరశ్మి యీ రోజు కనుపించడంలేదు. ఆ వెన్నెలలో ఆ వ్రేళ్లు ఎంతో కలతపెట్టేయి. వెళ్లి తక్షణం కడిగివేశాను. కొంచెమూ పోలేదు. ఆ ఎర్రని కెంగతో వెలిగే ఆ రంగు అలాగే వుండిపోయింది.

* * *

ఇంతలో స్నాతకోత్సవం వచ్చింది.

మబ్బు విడుతుందని ప్రతివారూ ఆశిస్తారు.

మేఘం ఎక్కి వెళ్ళినంత తేలికగా చేరను కలకత్తా—శాంతినికేతనానికి.

ఆ మరునాడు స్నాతకోత్సవం. ఆ, నేడే ఆమెను చూడగలుగుతాను!

నా పెట్టెలో వుండే వాడిన మొగలిరేకులన్నీ తీసేశాను. అవి నా కింక అనవసరం. ఆ సాయంత్రమే క్రొత్త పూలచెండు మళ్ళీ బట్టలలో పెడతాను...

స్నాతకోత్సవానికి ఆమె వస్తుంది. ఆమెకోసమని ఆ జాజిపందెర విరగబూస్తుంది. చక్కని ఆకారంలో చెండు కడుతుంది. నేను చెయ్యి సాచి ఆ తల కేసి చూస్తాను. ఘట్టిగా నవ్వి "ఇంకా ఈ చిలిపితనం పోలేదూ?" అంటుంది. 'వయస్సు వచ్చినా కుర్రతనము!' అన్నట్లు చూస్తుంది.

ఒక ఉత్తరము వ్రాయకపోయినా ఆ ఒక్క మాటా చాలదూ? జీవితమంతా అర్ధ్రం చెయ్యగలిగే మాట ఒక్కటే.

* * *

మరుసటిరోజు స్నాతకోత్సవం.

ఆ రోజు సాయంత్రం 'వత్సరాజు' మీద ప్రసంగం; కూలంకషంగా నాటకరీతులనూ, మానవ హృదయాన్నీ తెలుసుకున్న ప్రసంగం.

"వత్సరాజు ధీరలలితుడు. ఉదాత్తమూర్తి. జీవితపు చరియలలో పుష్పించే చిన్నపువ్వుల నన్నిటినీ కూడా చేర్చగలిగే రసికుడు...

మాళవిక అనామధేయురాలు. బేల. వాయువు చంచలతకు భయపడే మాలతీదళము........"

ఎంతో రక్తితో బోధిస్తున్నాడు.

ఆమె వచ్చింది!!

కలువపూవులకై వెదకుతూ వచ్చిన మాళవికలా వచ్చింది. సూర్యుని తొలికిరణం తాకి ప్రకాశించే మంచుబిందువులాంటి ముక్కుపుడకతో వచ్చింది...

ఆచార్యుడు మాళవికఅసహాయతను వర్ణిస్తున్నాడు.

ఒక నవ్వు!...మాళవికను కించపరుస్తూ ఒక నవ్వు!! ఆ ముగ్ధను చిన్నతనంచేస్తూ ఒక హేళన!!

ఆమెదే ఈ నవ్వు?

ఎంత మాధుర్యమైన నవ్వు—అప్పుడు!

మందస్మితం తెల్ల మందారపువ్వులను జ్ఞాపకం చేసేది.

హృదయం శకలాలు చేసే నవ్వు—ఇప్పుడు.

మోదుగుపువ్వులాంటి నవ్వు!!

తత్క్షణం నన్ను నేను తిట్టుకున్నాను.

నేను సరిగా వినలేదు!!

నా రసనయే చచ్చిపోయింది!!

ఆమెనవ్వు కాదు...

* * *

ఆరోజు స్నాతకోత్సవం.

ప్రారంభంలోనే ఆమె వచ్చింది.

తలనిండా జాజిపువ్వులు. మధ్య విడువని జారిపోతూవున్న కలువమొగ్గ పెట్టింది.

ఏదో చిత్రంలోంచి వచ్చే అప్సరసలా వచ్చింది.

నా కళ్లు రెండూ అక్కడే స్థాపితమయిపోయాయి.

ఉత్సవం అయిపోయిందట!...

... ...

ఉత్సవం అయిపోయింది.

నడువలేని కాళ్లతో ఆ ఉన్నతద్వారందగ్గర నుంచున్నా.

ఒక్కొక్కరూ వెళ్ళిపోయారు.

నా యశోధరాసిద్ధార్థుల ప్రథమసందర్శనం జ్ఞాపకంవచ్చింది. ఆఖరుకు మిగులుతుంది యశోధర.

... ...

ఆఖరున నడచిపోయింది ఆమె.

నేను చూస్తూనే వున్నాను. నన్ను ఆమె చూడనే లేదు.

అంతకాలం నుంచున్నానే!

ఆమె సాగిపోయింది. ఎవరికో నమస్కారం చేసి మాట్లాడుతూంది.

మెల్లగా అడుగులు లెఖ్ఖపెట్టుకుంటూ నడిచేను ఆమెప్రాంతంలోకి...

దూరంగా నుంచున్నాను.

ఎవరితోనో నవ్వుతూ కబురుచెబుతూంది.

దూరంనుంచి నేనూ నవ్వుతున్నాను.

చాలాసేపు అలాగే నుంచున్నాను!

ఇటు తిరిగింది!

రెండు చేతులూ హృదయందగ్గరగా జోడించి నమస్కారం చేశాను!!

చటుక్కున నాకేసి చూసింది. ఉలిక్కిపడింది.

"మీరా? మీరుకూడా వచ్చారా?" అంది.

నేనూ ప్రపంచకంలోకి వచ్చా ననబోయాను.

ఒక మాటా రాలేదు.

"క్షమించండి. కొంచెం తొందరగా వుంది"అని నమస్కరించింది.

నమస్కారం అందుకోబోయాను.

అప్పటికే ఆమె ఆ సమూహంలో కలిసి పోయింది.

నమస్కారం అందుకోవడంమాత్రం పూర్తి చేశాను.

అలాగే నిలువబడిపోయాను. ఏమి జరుగుతూందో స్పృహలేదు. ఎప్పుడు సాగిపోయానో స్మృతిలేదు.

అలాగే సాగిపోయాను!

ఎంతోకాలం!!

*   *   *

ఆమెస్వరూపము నాకు దివ్యవిగ్రహం. అందరూ ఆమెనూతనప్రదర్శనాలనుగురించి ప్రసంగిస్తారు. ఈ మధ్యన స్వరూపం మారిం దంటారు. నాకు చూడాలన్న జిజ్ఞాసే లేకపోయింది. ప్రతిక్షణమూ నాలోనే వుంది. ప్రతిదృశ్యమూ ఆమెకళలతోనే చూస్తాను. ప్రతిధ్వనీ ఆమెకోసం వింటాను. ఇంక ఆమె నాకెందుకు? ఆమెజీవితమే నేను బ్రతుకుతున్నాను. ఆమెఆశయాలే అనుకరిస్తున్నాను. నేను ఆమెకు ఎందుకు?

*   *   *

ఆ రోజు సన్నని చినుకులు పడుతున్నాయి.

భయభక్తులతో కూడా నడుస్తున్నాను.

"ఆమె నిన్ను ప్రోత్సాహపరిచిందని చెప్పగలవా?"అని అతని ప్రశ్న. సర్వమూ తెలుసుకున్న అతని ప్రశ్న. ఉభయపక్షాలనూ తెలుసుకున్న అతని ప్రశ్న. ఎవరిదగ్గరనుంచి వచ్చిందో ఈ ప్రశ్న? దానికి సమాధాన మేమిటి? నేను చెప్పాలా?

"నా తలంపులే నన్ను ప్రోత్సాహపరిచాయి. ఆమె ప్రోత్సాహపరచడ మేమిటి? జన్మతః వుండే మాధుర్యమే మనలో వికసిస్తుంది... కాని ఆమె ఛాయలో నేను వృద్ధిపొందేను..."

అతనికి విసుపు కలిగింది.

"అదికాదు నాయనా! ఆమె ఎప్పుడైనా మాటల్లోకాని, లేఖల్లోగాని ఏ విషయం గురించి అయినా నీలో ఆశలు రేకెత్తించిందా?"

హఠాత్తుగా ఆగిపోయాను.

"నువ్వు జీవిస్తున్నందుకు ఋజువు వుందా"అని అడిగినట్లయింది...

అవును. ఎవరి జీవితమో నేను బ్రతుకుతున్నాన్నానుకాదూ?

కొన్ని రోజులక్రితం ఆమెను చూడాలని ప్రయత్నం చేశానుకాదూ?...

వెళ్ళి—

"నీ అసౌఖ్యము పంచుకోవడము నాకు ఒక ఆనందము. ఎప్పుడూ అక్కడ ఎక్కువ లోభత్వమే కన్పిస్తాను. నాకు వున్న కొంచెము భాగ్యమూ నాతో పంచుకోవూ?"అని అడగా లనుకున్నాను.

కాని అదొక అసామర్థ్యత. బ్రతుకు లేకపోవడము. 'నాలో నేనే సర్వస్వము' అన్న వేదవాక్యము మరచిపోవడము.

నాకు వేరువ్యక్తిత్వ మేది? వేరు భావాలు ఏవి?

ఈ శరీరంలో వేరొకరి జన్మ నడుస్తూంది. ఇంక నేను వారి కెందుకు?

"ఆమె ఆశ శకుంతలేనా?" అని ఈనాటి ప్రశ్న...

కబరీభరంలో వాడిన గులాబీరేకులులా రాలి పోవాలి పాతస్మృతులన్నీ...

"ఏవిధమైన ఆధారమూ లేదు. అలా అనుకో కూడదు.

ఆమె సాయంసమయంలో వెలిగే అస్పష్ట ఆవేశం. నేను ఆ సృష్టివైచిత్ర్యము చూసి ఆనందించి పోయాను...అంతకు తప్ప మరేమీ లేదు"...

అతను నడచిపోయాడు!!

'తుది సందేశం ఇదేనా?' అనుకున్నాను.

* * *

సెలవుల్లో నాన్నగారు రామాయణం చదవ మన్నారు. సంస్కృతకావ్యాలంటే ఆయనకు ఎంత అభిమానం!

ముంగిలివాకిలి మురారిపదచింతనంతో మ్రోగి పోయేది...మహాశ్వేతను నాకు పరిచయంచేసినవారు మా తాతగారు...

ఆ దివ్యపరిసరాల్లో జన్మేజ్ఞానము. ఇంక చదువ నవసరములేదు...

అన్నీ చదువుతూ వచ్చాను...సీతను భక్తితో, వినయంతో లక్ష్మణుడు వదిలివెళ్ళినచోట కళ్లనీళ్లతో కొంతభాగం నాన్నగారు తీసెయ్యమన్నారు. జరిపి వేశాను...తరువాత శ్రీరామచంద్రమూర్తి 'హస్తాం బుజములు మొగిచి' అంటాడు:

"...భువనాంచితపూ హయమేధ మేను మీ
యనుమతి జేయువాడ నని
యాత్మ దలంచితి మీర లమ్మఖం
బునకు ననుజ్ఞ యిం డని..."

శ్రీరామచంద్రమూర్తియే ప్రార్థిస్తాడు. ప్రాజ్ఞుడు; ధర్మమూర్తి. శ్రీరామచంద్రుడు. తలపెట్టినదా "ముజ్జగ ములకు సమ్మత మాక్రతువు". పూర్వము వృత్రవధవలన గలిగిన బ్రహ్మహత్య బోగొట్టగలిగినది హయమేధము. ఇలునకు పురుషస్వరూపము స్థిరమైన జన్మము. ఇంక ఆయనకు అడ్డు ఏమిటి?

మును లందరూ ఆశీర్వదించారు.

కాని, ధర్మశంక వచ్చింది. 'సహధర్మచరి' సీతకు దూరమైపోయాడు శ్రీరాముడు. సీత ఎక్కడో వుంది. కాదు, అతనిలోనే వుంది—కాని విధ్యుక్త ధర్మ నిర్వహణకు ఒక స్వరూపం అవసరము.

ధర్మవిదులు సందేహం తీర్చారు. సీతప్రతిమను స్వర్ణముతో సీతగా నిర్మించారు. ఈమె 'ధరాసుతా కార సువర్ణపుత్రిక'.

ధర్మలోపం లేకుండా తన సతి సీతస్థానం ఆక్ర మించిన ఆదర్శం. అతని ఆశయం సీత; అనుకరణ స్వర్ణ సీత. అతని ఆవేదన సీత; ఆవేదనారూపబింబము స్వర్ణసీత!

తక్షణం ఆగిపోయాను.

జన్మజన్మాల వివేకమూ, నా జీవితపు కీలకమూ నాకు అర్థమయింది.

ఒకచే చిన్న గులాబీపువ్వు వాసనలా నన్ను సోకింది. తక్షణం ఆకాశమంతా ఆవరించిపోయింది...

తక్షణం ఆమెకు ఇలా వ్రాశాను:

"కొంతమందికి స్వర్ణసీత ఒక విధ్యుక్తధర్మము.

కొంతమందికి ఒక తీరని కోరిక.

నాకుమాత్రం కోరకే లేని తీరిక.

నాలోని స్వర్ణమంతా ప్రోగుచేసి ప్రతిరహిత మైన స్వర్ణసీతను నేనే నిర్మించుకున్నాను.

ఆమెనే సతతం అర్చిస్తున్నాను.

నా జీవితమే ఆ ఆరాధన!"